



# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 06-06-2024 సంపుటి : 06 సంచిక : 265 పేజీలు : 8 వెల : రూ 3-00


## నంబర్ గేమ్ ఇది రాజకీయాల్లో భాగమే..- ప్రధాని మోదీ..



న్యూఢిల్లీ:జూన్ :06.( మహాన్ న్యూస్ )సార్వత్రిక ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించిన ఎన్డీయే కూటమి కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే బుధవారం ప్రధాని నివాసంలో కేంద్ర మంత్రివర్గం చివరిసారిగా సమావేశమైంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ కేబినెట్‌కు కీలక సూచనలు చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలపై కూడా ఆయన మాట్లాడారు. ఫలితాల్లో నంబర్ల గేమ్ కొనసాగుతూనే ఉంటుంది. ఇది రాజకీయాల్లో భాగమే. దశాబ్ద కాలంలో దేశ అభివృద్ధికి సర్కార్ ఎంతో కృషి చేసింది. అందుకు మీరూ ఎంతో శ్రమించారు. దీన్ని ఇలాగే కొనసాగించండి. అవినీతిపై పోరాటం మరింత పటిష్ఠంగా మారుతోంది. రాజకీయ ప్రయోజనాల కోసం అవినీతిని కొందరు (ప్రతిపక్షాలను ఉద్దేశిస్తూ) కీర్తిస్తున్నారు. ఈ సారి అవినీతిని రూపుమాపడంపై ఎన్డీయే దృష్టి సారిస్తుంది. ప్రపంచంలో భారత్ బలమైన శక్తిగా అవతరిస్తుంది. మనమంతా సమష్టిగా కృషి చేస్తే సరికొత్త అధ్యాయాన్ని లిఖించవచ్చు. ఇదే ప్రజలకు మోదీ హామీ" అని ప్రధాని అన్నారు.

## మరింత బాధ్యతతో జనసేన ఎంఎల్ఎలు కలిసి పని చేయాలి

### ఓటేసిన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలి జనసేన అధినేత పవన్ కల్యాణ్ హితవు




అమరావతి జూన్ 5 మరింత బాధ్యతతో జనసేన ఎంఎల్ఎలు కలిసి పని చేయాలని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. జనసేన పార్టీ నుంచి గెలిచిన అభ్యర్థులతో పవన్ కల్యాణ్ సమావేశమ య్యారు. గెలిచిన అభ్యర్థులను పవన్ అభినందించారు. ఈ సందర్భం గా పవన్ మాట్లాడారు. ఓటేసిన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల ఆకాంక్షల మేరకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. జనసేన నూటికి నూరు శాతం విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. వైసిపిపై కక్ష సాధింపు చర్యలుండవని, వ్యవస్థల్లో రాజకీయ ప్రమేయం తగ్గిస్తామని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బలమైన పునాదులు నిర్మించేలా కూటమి పాలన ఉంటుందని పవన్ వివరించారు. చీకటి రోజులు పోయాయని, కలిసికట్టుగా పనిచేసే రోజులు వచ్చాయని తెలియజేశారు.

## ఏపీ సచివాలయంలో ఈ-ఆఫీస్‌ను స్వాధీనం చేసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు..

అమరావతి: ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ఐటీ శాఖ ఆధ్వర్యంలో నడిచే ఈ-ఆఫీస్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు( స్వాధీనం చేసుకున్నారు. తాళం వేసి లాగిన్ ఐడీలు క్లోజ్ చేశారు. సీఎం కార్యాలయానికి చెందిన ఫైళ్లు ఈ-ఆఫీస్ నుంచి మాయం చేస్తున్నారని డీజీపీకి ఫిర్యాదు అందిన వెంటనే సైబర్ క్రైమ్, ఇతర పోలీస్ టీమ్‌లు రంగంలోకి దిగారు. వారం రోజుల నుంచి జరిగిన ఫైళ్ల మూవ్మెంట్‌ను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. కొన్ని శాఖల అధికారులు ఫైళ్లు చించి వేస్తున్నారని పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఛైర్మన్ హేమచంద్రారెడ్డి.. నిన్న ఫైళ్లను ముక్కలు ముక్కలుగా చింపేశారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ-ఆఫీస్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. కొంతమంది ఉద్యోగులను సైతం పోలీసు అధికారులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన తప్పుల నుంచి కాపాడుకునేందుకే ఫైళ్లు చింపివేస్తూ, మాయం చేస్తున్నారని కూటమి శ్రేణులు అభిప్రాయపడుతున్నారు.

# సూపర్ సిక్స్ , ప్రజా గళం పనిచేసాయి

### అహంకారం, నియంతృత్వాన్ని ప్రజలు అంగీకరించారు ఎన్డీయోతోనే ప్రయాణం : చంద్రబాబు నాయుడు



విజయవాడ, ఏపీలో ఎంత మేరకు విధ్వంసం జరిగిందో తరచి చూస్తే తప్ప లోతు తెలియదని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అన్నారు. ఎన్నికల్లో భారీ విజయం తర్వాత తొలి సారి మీడియా సమావేశం నిర్వహించారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఢిల్లీ వెళుతున్నట్టు చెప్పారు. ఏపీలో మీడియాకు స్వాతంత్ర్యం వచ్చిందని, ఆ తర్వాత ప్రజలకు వచ్చిందని చంద్రబాబు అన్నారు. కాసేపట్లో ఢిల్లీ వెళుతున్నట్టు చెప్పారు. మీడియా ద్వారా ప్రజలతో మాట్లాడుతున్నానని చెప్పారు. మీడియా, రాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. శిరస్సు వంచి నమస్కారాలు చేస్తున్నానని చెప్పారు. సుదీర్ఘమైన రాజకీయ యాత్రలో ఐదు సంవత్సరాలు చూసిన ప్రభుత్వాన్ని ఎప్పుడు చూడలేదన్నారు. ఒక రంగం, వ్యవస్థ కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ ఎలా ఇబ్బంది పడ్డాయో అన్నీ చూశామన్నారు. ప్రజలు గెలవాలి, రాష్ట్రం నిలబడాలి, దీని కోసం ఎన్ని త్యాగాలైనా చేసి మళ్లీ భావి తరాల భవిష్యత్ కోసం ముందుకు వెళ్లినట్టు చెప్పారు. పదో ఎన్నికను చూశానని, ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ముందుకు వెళ్ళామన్నారు. దేశం శాశ్వతం, ప్రజాస్వామ్యం శాశ్వతం, అధికారం అశాశ్వతం అన్నారు. ఎన్నో పార్టీలు, వ్యక్తులు కనుమరుగైపోతాయన్నారు. ఇంత చారిత్రకమైన ఎన్నికలను ఎప్పుడు చూడలేదన్నారు. ఎన్నికల్లో వ్యతిరేకత కనిపించిందని, అమెరికాలో ఉండే వ్యక్తి కూడా ఐదారు లక్షలు ఖర్చు చేసి ఓటు వేయడానికి వచ్చారని, కడుపు నింపుకోడానికి పక్క రాష్ట్రాలకు వెళ్లిన వారు నేరుగా సొంత డబ్బులతో వచ్చారన్నారు. భోజనాలు ప్యాక్ చేసుకుని ఓట్లు వేయడానికి వచ్చారని, ఆ కమిట్మెంట్ను ఎలా అభినందించాలో తెలియడం లేదన్నారు. టీడీపీ చరిత్రలో, ఏపీ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన చరిత్ర అన్నారు. 83లో గెలిస్తే 200సీట్లు వచ్చాయని, 94లో ప్రజా వ్యతిరేకత, ముగ్గురు ముఖ్యమంత్రులు మారడం వల్ల అపోజిషన్ స్టేటస్ లేకుండా సీట్లు వచ్చాయని, ఈసారి మాత్రం ఊహించని విధంగా ఫలితాలు వచ్చాయన్నారు. దానికి కారణాలు అనుభవించిన ప్రజలకు తెలుసన్నారు. ప్రజాస్వామ్యంలో మాట్లాడే హక్కును కోల్పోయారని, బతికే స్వేచ్ఛ, ఆస్తులు పెట్టుకునే స్వేచ్ఛ కోల్పోయారని, ఎన్నికల్లో ఎలా కలిశామో ప్రజలకు తెలుసన్నారు. ప్రతి సందర్భంలో బహిరంగ వేదికపై ప్రజలు గెలవాలన్నదే తమ అకాంక్ష అని అన్నారు. 55.38శాతం 45.60శాతం టీడీపీకి, వైసీపీ 39.37శాతం ఓట్లు పడ్డాయని చంద్రబాబు చెప్పారు. ఒక్కో చోట 95వేల మెజార్టీ వచ్చిందని. ఛార్మినార్కు ఎక్కువ మెజార్టీ వచ్చేవని, కుప్పం, సిద్ధిపేటలో మెజార్టీ బాగా వచ్చేదని, ఈసారి 95, 94, 92, మంగళగిరిలో 91వేల మెజార్టీ వచ్చిందని ప్రజల తీర్పు, అహంకారం నియంతృత్వం, విచ్చలవిడితనం, ఏదనుకుంటే అది చేస్తామంటే ప్రజలు క్షమించరన్నారు. ప్రజల గుణపాఠం, అవినీతి అహంకారంతో ముందుకు పోయే ఎలాంటి విధ్వంసకారులకైనా ఇదే గుణపాఠమన్నారు. ఐదేళ్లు కార్యకర్తలు పడిన ఇబ్బందులు, కంటి నిండి నిద్రలేని రాత్రులు గడిపిన కార్యకర్తలకు కృతజ్ఞతలు చెప్పారు. మనిషిని హింసిస్తూ ప్రాణంతో బ్రతకాలంటే జైజగన్ అనాలని చెబితే జై తెలుగుదేశం, జై చంద్రబాబు అంటూ చంద్రయ్య ప్రాణాలు వదిలాడని గుర్తు చేసుకున్నారు. ఐదేళ్లు మీడియ పడిన ఇబ్బందులు, కోర్టుల చుట్టూ, సిబిసిఐడి ఆఫీసుల చుట్టూ తిప్పుతూ వేధించడం చూసి ప్రజాస్వామ్యం తలదించుకోవాలన్నారు. ఎవరినైనా కొట్టొచ్చన్నట్టు వ్యవహరించవచ్చు అన్నట్టు ప్రవర్తించారన్నారు. పవన్ కళ్యాణ్ చొరవతోనే?సూపర్ సిక్స్ , ప్రజా గళం ప్రజల్లోకి బాగా వెళ్లాయన్నారు. ఓ వైపు టీడీపీ, మొదటి సారి పవన్ కళ్యాణ్ ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలినివ్వకూడదని కూటమికి బీజం వేసిందుకు అభినందించారు. ఆ తర్వాత బీజేపీ కూడా కూటమిలో భాగస్వామి అయ్యిందన్నారు. ఎలాంటి బేషజాలు లేకుండా ప్రజలు గెలవాలి, రాష్ట్రం నిలబడాలని పై స్థాయి నుంచి ఇక్కడున్న పవన్, టీడీపీ నాయకత్వం వరకు నిజమైన చిత్తశుద్ధితో పనిచేశామన్నారు. 175 సీట్లు, 25 పార్లమెంటు సీట్లలో అన్ని పార్టీల సీట్లుగా భావించి ఎన్నికలకు వెళ్లామన్నారు. తమపై చాలా బాధ్యత ఉందని చెప్పారు. రాష్ట్రంలో 9సార్లు కరెంటు ఛార్జీలు పెంచారని, ఎందుకో పెంచారో ఎవరికి తెలియదని, కరెంటు మీద ఎంత డబ్బు తెచ్చారు, ఏ పేరుతో డబ్బులు తెచ్చారో తెలుసుకోవాలన్నారు. ఇవన్నీ తెలుసుకున్న తర్వాత వివరాలు వెల్లడిస్తామన్నారు. సంబంధం లేని డిపార్ట్మెంట్ నుంచిడబ్బులు తెచ్చి వేరే శాఖలకు ఇచ్చారని చెప్పారు. నాకు, నా కుటుంబానికి, నా భార్యకు జరిగిన అవమానాలకు ఎంతో బాధపడ్డానని చంద్రబాబు చెప్పారు. బాంబు దాడులకు కూడా తాను భయపడలేదని, తన కుటుంబంపై చేసిన దాడులకు, కౌరవ సభలో ఉండనంటూ, క్షేత్ర స్థాయిలో గెలిచిన తర్వాత అసెంబ్లీలో అడుగు పెడతానని ప్రతిజ్ఞ చేశానని, దానిని నిజం చేయడానికి ప్రజలు సహకరించారన్నారు. చాలా సార్లు ఎన్నికల్లో ఓడిపోతే కుంగిపోలేదని, గెలిచినపుడు గెంతులు వేయలేదని, వాటిని బాధ్యతగానే భావించినట్టు చెప్పారు. తన కుటుంబానికి జరిగిన అవమానాలతో చెప్పిన మాటలకు నిలబెట్టుకునేలా చేసిన ప్రజలకు రుణం తీర్చుకుంటానని, వారి అంచనాలకు అనుగుణంగా పనిచేస్తానని చెప్పారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వాన్ని నడిపించే బాధ్యత ప్రజలదే అన్నారు. ఎప్పటికప్పుడు ఫీడ్ బ్యాక్ ఇవ్వాలన్నారు. పవన్ కళ్యాణ్, బీజేపీ అగ్ర నాయకుల్ని అభినందించారు. ఈ విజయం మూడు పార్టీల సమిష్టి విజయం అన్నారు. ఎన్డీఏతోనే ప్రయాణం?తాము ఎన్డీఏలోనే ఉన్నామని, దేశంలో ఎన్నో రాజకీయ పరిణామాలను చూశానని, ఎన్డీఏ సమావేశానికి తాను వెళుతున్నానని ఎలాంటి సందేహాలు వద్దని ఢిల్లీ వెళ్లి వచ్చిన తర్వాత అన్ని విషయాలు చెబుతానని చంద్రబాబు స్పష్టం చేశారు.

# కేజ్రీవాల్‌కు దక్కని ఊరట..

### మధ్యంతర బెయిల్ తిరస్కరించిన స్పెషల్ కోర్టు



న్యూఢిల్లీ,జూన్5: ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్టై తీహార్ జైల్లో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, సీఎం అరవింద్ కేజ్రీవాల్ కు మధ్యంత బెయిల్ విషయంలో ఊరట దక్కలేదు ఈ కేసులో మధ్యంతర బెయిల్ ను మరోసారి పొడిగించాలంటూ తాను పెట్టుకున్న అభ్యర్థనను ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు తిరస్కరించింది. అనారోగ్య పరిస్థితుల కారణంగా వైద్య పరీక్షల నిమిత్తం తనకు మరో 7 రోజులు మధ్యంతర బెయిల్ కోరుతూ కేజ్రీ రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన స్పెషల్ కోర్టు.. బెయిల్ పిటిషన్‌ను కొట్టేసింది. వైద్య పరీక్షలను తీహార్ జైల్లోనే నిర్వహించాల్సిందిగా అధికారులకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అవసరమైన అన్ని వైద్య పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కేజ్రీ జ్యుడీషియల్ కస్టడీని మరో 14 రోజులకు పొడిగించింది. జూన్ 19 వరకూ కస్టడీని పొడిగిస్తూ ఆదేశాలిచ్చింది. లిక్కర్ పాలసీ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తన అరెస్ట్‌ను సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దానిపై విచారణ ఆలస్యమవుతుండటంతో ఎన్నికల్లో ప్రచారం నిర్వహించుకునేందుకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని అభ్యర్థించారు. దీంతో సర్వోన్నత న్యాయస్థానం మే 10న కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జూ 1 వరకూ బెయిల్ మంజూరు చేసింది. ఇక జూన్ 2న లొంగిపోవాలని ఆదేశించింది. అయితే, తీవ్రమైన అనారోగ్య కారణాల దృష్ట్యా తనకు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను మరో 7 రోజులు పొడిగించాలని కోరుతూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో మరో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. అయితే, కేజ్రీవాల్ చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకునేం దుకు సుప్రీం నిరాకరించింది. ఆయన వేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టబోమని బుధవారం స్పష్టం చేసింది. రెగ్యులర్ బెయిల్ కోసం ట్రయల్ కోర్టును ఆశ్రయించేందుకు కేజ్రీవాల్ ఇదివరకే అవకాశం ఇచ్చినందున ఈ పిటిషన్‌ను విచారిం చడం సాధ్యం కాదని కోర్టు రిజిస్ట్రీ తెలిపింది. దీంతో ఆయన జూన్ 2న మధ్యాహ్నం లొంగిపోయారు.

# ఫస్ట్ టైమ్ ఆ జిల్లా ఓటర్ల విలక్షణ తీర్పు.. పాత సాంప్రదాయానికి చరమగీతం!




జిల్లా చరిత్రలోనే కనివిని ఎరుగని విక్టరీ? ఒక్కటంటే ఒక్కటి కూడా ఇతర పార్టీలకు దక్కని వైనం.. పదిహేను అసెంబ్లీ సెగ్మెంట్స్, మూడు లోక్ సభ స్థానాల్లో కూటమి అభ్యర్థులదే విజయం. కేవలం విజయమేనా.. భారీ మెజార్టీలు. సమీక్షించుకునే అవకాశం కూడా లేని విధంగా అధికార పార్టీకి ఘోర ఓటమి. ఈ ఫలితాలతో ఎలా ఉండబోతోంది ఏపీ రాజకీయం? విపక్షం ఉనికిని ఎలా చాటుకుంటుంది? ఇదే ఇప్పుడు హాట్‌టాపిక్ మారింది. గుంటూరు కారమే కాదు.. ఇక్కడి రాజకీయం కూడా యమ ఘాటు. అందుకే రాష్ట్ర రాజకీయాల్లోనే గుంటూరుజిల్లాకో ప్రత్యేక స్థానం.

గత నాలుగు ఎన్నికల్లోనూ జిల్లా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. ఈ ఎన్నికల్లో విపక్ష కూటమికి చారిత్రక విజయాన్ని కట్టబెట్టారు. 2004 ఎన్నికల్లో ఉమ్మడి గుంటూరుజిల్లాలో టీడీపీకి ఒక్క సీటు మాత్రమే దక్కింది. 19 అసెంబ్లీ స్థానాల్లో 18 చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులే గెలిచారు. 2009లో పునర్విభజన తర్వాత పదిహేడు నియోజకవర్గాలుగా మారితే అందులో పదకొండు కాంగ్రెస్ గెలిచింది. ఆరు స్థానాల్లో టీడీపీ విజయం సాధించింది. రాష్ట్ర విభజన తర్వాత 2014 ఎన్నికల్లో వైసీపీకి ఐదు సీట్లొస్తే.. పన్నెండు స్థానాల్లో గెలిచి టీడీపీ తన ఆధిక్యాన్ని చాటుకుంది. 2019 ఎన్నికల్లో వైసీపీ ఏకంగా 15 సీట్లు గెలిస్తే.. టీడీపీ రెండు సీట్లతో సరిపెట్టుకుంది. 2004 నుంచీ నాలుగు అసెంబ్లీ ఎన్నికలను పరిశీలిస్తే ఉమ్మడి గుంటూరుజిల్లా ప్రజలు పూర్తి ఏకపక్షంగా కాకుండా ప్రత్యర్థి పార్టీలకు ఎంతో కొంత అవకాశమిస్తూ వచ్చారు. కానీ మొదటిసారి ఈ అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని సీట్లూ కూటమి ఖాతాలో పడ్డాయి. ఉమ్మడి గుంటూరుజిల్లాలో ఈసారి పదహారు చోట్ల టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. జనసేనకు ఇచ్చిన తెనాలి నుంచి ఆ పార్టీ కీలక నేత నాదెండ్ల మనోహర్ గెలిచారు. వీటితో పాటు ఉమ్మడి జిల్లాలోని మూడు పార్లమెంట్ స్థానాల్లో కూడా టీడీపీ అభ్యర్థులే విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో పల్నాడు ప్రాంతంలోని ఏడు అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంట్ నియోజకవర్గాన్ని వైసీపీనే గెలిచింది. అప్పట్లో ఐదు అసెంబ్లీ స్థానాల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలకు 20వేలకు పైనే మెజారిటీ వచ్చింది., అదే ట్రెండ్ కొనసాగిస్తూ ఈ సారి పల్నాడులోని ఏడు అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంట్ స్థానాన్ని టీడీపీ గెలుచుకుంది. ఐదుగురు 25వేలకు పైనే మెజారిటీ సాధించారు. నర్సరావుపేటలో అరవింద్‌బాబుకు మాత్రమే 20వేల లోపు మెజారిటీ వచ్చింది. రాజధాని అంశం గుంటూరు జిల్లాతో పాటు పల్నాడు ప్రాంతంలో గట్టి ప్రభావం చూపించిదన్న ప్రచారం జరుగుతోంది. టీడీపీ ఆవిర్భావం తర్వాత గుంటూరు గడ్డపై ఆ పార్టీకి ఇదే అతిపెద్ద విజయమని పార్టీ తమ్ముళ్లు సంబరపడుతున్నారు.

# సంపాదకీయం

గురువారం 06-06-2024

## మిషన్ ఇంపాజిబుల్ గా 400 పార్

భారతీయ జనతా పార్టీ చార్ సౌ పార్ నినాదం మిషన్ ఇంపాజిబుల్‌గా మారిపోయింది. లోక్‌సభలో సంపూర్ణ మెజార్టీ సాధిస్తామని ఎంతో ధీమాగా ఎన్నికల బరిలోకి దిగిన బీజేపీ ఇప్పుడు సొంతంగా మెజార్టీ సాధించడం గగనంగా మారింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వచ్చేశాయి. 400 సీట్లు సాధించాలన్న లక్ష్యంలో ఈ ఎన్నికల బరిలో దిగిన బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి ఆశించిన సీట్లు సాధించలేకపోయింది. 2019లో 303 సీట్లు సాధించిన బీజేపీ ఈసారి భారీగా సీట్లు కోల్పోయింది. కనీసం గత ఎన్నికల సీట్లు కూడా సాధించలేదు. దేశంలో ఆదివాసీలు, దళితుల జనాభా ఎక్కువ. 2014, 2019 ఎన్నికల్లో వీరంతా బీజేపీకి మద్దతుగా నిలిచారు. ఈ ఎన్నికలకు ముందు భాజపా నేత అనంత్ హెగ్డే తమకు 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మార్చివేస్తామని ప్రకటించారు. ఈ మాటలను విపక్షాలు అందుకున్నాయి. రిజర్వేషన్లను రద్దు చేసేందుకే బీజేపీకి 400 సీట్లు కావాలంటోందని ప్రచారం చేశాయి. ఇది మారుమూల ప్రాంతాల్లోకి దూసుకెళ్లింది. తమ రిజర్వేషన్లను బీజేపీ ఎత్తేస్తుందన్న ఆందోళనతో వ్యతిరేకంగా ఓట్లు వేశారు. కాంగ్రెస్ విమర్శలను ప్రధాని మోదీ తిప్పికొట్టినా.. పార్టీ యంత్రాంగం దీనిని గ్రామస్థాయికి తీసుకెళ్లడంలో విఫలమైంది పదేళ్ల తర్వాత తొలిసారి ప్రభుత్వ ఏర్పాటులో మిత్రపక్షాలపై ఆధారపడాల్సిన పరిస్థితి కాషాయదళానికి తలెత్తింది. ఎన్నికలు షెడ్యూల్‌కు చాలా కాలం ముందే బీజేపీ చార్ సౌ పార్ నినాదాన్ని బీజేపీ అందుకుంది. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేసినందుకు సొంతంగా బీజేపీకి 370 సీట్లు, ఔఅం కూటమి 400 సీట్లు సాధిస్తుందని బీజేపీ అగ్రనేతలు పదేపదే తమ ప్రచారంలో ప్రస్తావించారు. బట్ అది వర్కౌట్ కాలేదు. ఫలితాలు చూస్తుంటే బీజేపీ ఈ ఎన్నికల్లో సొంతంగా మెజార్టీ మార్కు 241కు చేరుకోవడం సాధ్యం కాదనే విషయం తేటతెల్లమైంది. నిరుద్యోగం, ధరల పెరుగదల, అగ్నివీర్ పథకం బీజేపీకి భారంగా మారాయంటున్నారు నిపుణులు. సైన్యంలో అత్యధిక సంఖ్యలో యువకులు చేరే రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో బీజేపీకి సంఖ్యాబలం తగ్గడం అగ్నివీర్ ప్రభావమే అని చెప్పక తప్పదు. బీజేపీ ఆలోచనలకు అతి పెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్ పెద్ద దెబ్బకొట్టింది. అయోధ్యలో రామమందిరం కట్టక ముందు యూపీలో బీజేపీ ఎంతో ఆదరణ సాధించింది. 2019 ఎన్నికల్లో యూపీలో 80 స్థానాలకు గాను 62 చోట్ల విజయం సాధించింది. కానీ ఈసారి ఆ సంఖ్య సగానికి తగ్గింది. అయోధ్యలో రామమందిర నిర్మాణం, బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ గురించి ప్రతీ సభలోనూ పదే పదే ప్రస్తావించినా యూపీ ఓటర్లు మాత్రం బీజేపీని అంతగా ఆదరించలేదు. ఇద్దరు కుర్రాళ్లు, ఇద్దరు యువరాజులంటూ రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్‌ను ప్రతీ సభలోనూ ప్రధాని మోదీ విమర్శించడం యూపీ ఓటర్లు అంతగా ఆకట్టుకోలేదని అనుకోవాలి. ఇన్‌ఫ్యాక్ట్ ఆ మాటలు ఆ యువరాజుల వైపు ఆలోచించేలా చేశాయి. అత్యధిక ఎంపీ సీట్లున్న మహారాష్ట్రలోనూ బీజేపీ బలహీనపడింది. ఔఅఖ, శివసేనను చీల్చడం మహారాష్ట్ర ఓటర్లు జీర్ణించుకోలేకపోయారు. మహారాష్ట్ర బీజేపీ కేవలం 12 స్థానాలకే పరిమితమైంది. ఏక్‌నాథ్ షిండే పార్టీ ఆరు స్థానాలు, ఔఅఖని చీల్చి తనదే ఆ పార్టీ అని ప్రకటించుకున్న అజిత్ పవార్ పార్టీ కేవలం ఒక్క స్థానంలో మాత్రమే విజయం సాధించింది. సొంత రాష్ట్రం గుజరాత్‌ను వరుసగా మూడోసారి క్లీన్ స్వీప్ చేయాలనుకున్న మోదీ–షా వ్యూహం ఈ ఎన్నికల్లో విఫలమైంది. పదేళ్ల తర్వాత తొలిసారి గుజరాత్ నుంచి కాంగ్రెస్ తరపున ఒక ఎంపీ లోక్‌సభలో అడుగుపెట్టబోతు న్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం గతంలో కేవలం ఒక్క ఓటుతో ఓడిపోయింది. తర్వాత జరిగిన ఎన్నికల్లో దేశ ప్రజలు ఆయనకు పీఠం కట్టబెట్టారు. నేటి బీజేపీ నాయకత్వం ఫిరాయింపులను ప్రోత్సహిస్తోంది. పలు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలను చీల్చి ప్రభుత్వాలను కూల్చింది. తమకు అనుకూలంగా ఉన్నవారితో ప్రభుత్వాలు ఏర్పాటు చేసింది. మహారాష్ట్ర రాజకీయాల్లో శివసేన చీలిపోవడం ఏక్నాథ్ శిండే సీఎం కావడంపై నిరసన వ్యక్తమైనా పట్టించుకోలేదు. గతేడాది శరద్ పవార్ పార్టీ సైతం బీజేపీ చీల్చింది. ప్రజాస్వామ్యవాదులు జీర్ణించుకోలేకపోయారు. వీరి అసమ్మతి నిశ్శబ్దంగా ఓట్ల రూపంలో బయటపడింది. దేశంలోని యువత ప్రత్యేకించి హరియాణా, ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్.. తదితర రాష్ట్రాల్లో సైనికదళాల్లో చేరుతుంటారు. వారి ఆశలపై నీరుచల్లుతూ కేంద్రం అగ్నివీర్ పథకాన్ని తీసుకొచ్చింది. దీనిపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమైనా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దేశంలో పేదలు ఎక్కువగా ఉన్నారు. అసలు తమకు ఎలాంటి పథకాలు ఉన్నాయో కూడా తెలియని అమాయకులు ఎంతో మంది. వీరికి రేషన్ అందుతోందా లేదా అన్న అంశంపై స్థానికంగా ఉండే భాజపా, మిత్రపక్షాల కార్యకర్తలు దృష్టిపెట్టాల్సి ఉంది. వందేభారత్ తదితర సూపర్‌ఫాస్ట్ రైళ్లను ప్రవేశపెట్టిన ప్రభుత్వం సామాన్యుడి ఆకాంక్షలను పట్టించుకోలేదు. మధ్యతరగతి, ఉన్నత వర్గాలు సమాజంలో తక్కువ ఉంటారు. ఎన్నికల వ్యవస్థలో పాల్గొనేది పేదలే. వారికి అనుకూలంగా సంస్కరణలు ఉండాలి. జీఎస్టీ పన్ను విధానం గందరగోళంగా ఉంది. ప్రభుత్వాలకు పెద్ద ఎత్తున ఆదాయం వస్తున్నా సామాన్యులు వినియోగించే పలు వస్తువులపై పన్నును తగ్గించకపోవడంతో వారిపై భారం పడింది.

## నీట్ యూజీ 2024 ఫలితాల్లో ఏకంగా 67 మందికి ఫస్ట్ ర్యాంకు.. కటాఫ్ మార్కులు ఇవే!




న్యూఢిల్లీ, జూన్ 5: నీట్ యూజీ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) జూన్ 4న వెల్లడించిన సంగతి తెలిసిందే. దేశ వ్యాప్తంగా మొత్తం 23.33 లక్షల మంది విద్యార్థులు నీట్ యూజీ పరీక్షకు హాజరుకాగా వీరిలో 13.16 లక్షల మంది ఉత్తీర్ణత సాధించారు. తెలంగాణ నుంచి నీట్ యూజీ పరీక్షకు మొత్తం 79,813 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 77,849 మంది పరీక్ష రాశారు. ఇందులో 47,371 మంది కనీస అర్హత మార్కులు సాధించారు. దేశ వ్యాప్తంగా చూస్తే 67 మంది విద్యార్థులకు 99.997129 పర్సంటైల్ వచ్చింది. సాధారణంగా ఆలిండియా ఫస్ట్ ర్యాంకు ఒకరికో, ఇద్దరికో వస్తుంది. కానీ నీట్ యూజీలో మాత్రం ఏకంగా 67 మందికి రావడం ఒకింత ఆశ్చర్యానికి గురిచేసింది. వీరందరికీ ఒకే పర్సంటైల్ వచ్చింది. ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ వచ్చిన వారిలో ఆంధ్రప్రదేశ్ నుంచి నలుగురు విద్యార్థులు ఉండటం విశేషం. ఫస్ట్ ర్యాంకు సాధించిన వారిలో 14 మంది అమ్మాయిలు, 53 మంది అబ్బాయిలు ఉన్నారు. రాజస్థాన్ నుంచి అత్యధికంగా 11 మంది విద్యార్థులు ఒకటో ర్యాంకు సాధించారు. నీట్‌లో అర్హత సాధించిన వారందరికీ కౌన్సెలింగ్ నిర్వహించి ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి తదితర కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఇక తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌కు చెందిన అనురన్ ఘోష్ అనే విద్యార్థి 77వ ర్యాంకు సాధించాడు. దీంతో ఈసారి తెలంగాణ నుంచి 100లోపు ర్యాంకు కేవలం ఒకరు మాత్రమే సాధించినట్లైంది. కాగా నీట్ యూజీ 2024 పరీక్ష మే 5వ తేదీన దేశ వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన సంగతి తెలిసిందే. నీట్ యూజీ పరీక్ష మొత్తం 720 మార్కులకు నిర్వహించారు. ఇందులో జనరల్ కేటగిరికి కటాఫ్ 164 మార్కులుగా నిర్ణయించారు. నీట్ యూజీలో జనరల్ కేటగిరి అభ్యర్థులు 164 మార్కులు వస్తేనే ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశాలు పొందుతారు. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు 129 మార్చులు, ఈడబ్ల్యూఎస్ కేటగిరికి 146 మార్కులుగా కటాఫ్ నిర్ణయించారు.

## దేవేంద్ర ఫడ్నవీస రాజీనామా ప్రతిపాదన..

### డిప్యూటీ సీఎం పదవి నుంచి తప్పించాలంటూ బీజేపీకి వినతి

ముంబై: మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ రాజీనామాకు సిద్ధమయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ రాష్ట్రంలో బీజేపీ పరాజయానికి నైతిక బాధ్యత వహించారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా చేస్తానని బీజేపీకి ప్రతిపాదించారు. ఈ ఏడాది నవంబర్‌లో జరుగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీని బలోపేతం చేయడంపై దృష్టిసారిస్తానని చెప్పారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం బాధ్యతల నుంచి తనను తప్పించాలని బీజేపీ నాయకత్వాన్ని అభ్యర్థించారు. బుధవారం ఈ విషయాన్ని దేవేంద్ర ఫడ్నవీస్ స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మహారాష్ట్రలో ఫలితాలకు నాదే బాధ్యత. పార్టీకి నేను నాయకత్వం వహిస్తున్నా. రాబోయే ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేయడానికి ప్రభుత్వ బాధ్యతల నుంచి నన్ను




తప్పించాలని బీజేపీ హైకమాండ్‌ను అభ్యర్థిస్తున్నా' అని అన్నారు. కాగా, మహారాష్ట్రలోని 48 స్థానాల్లో 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 23 సీట్లు గెలిచింది. అయితే ఈసారి ఎన్నికల్లో కేవలం 9 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. సీఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివనేత, అజిత్ పవర్ నేతృత్వంలోని ఎన్సీపీతో కలిసి ఎన్డీయే కూటమి 17 సీట్లు దక్కించుకున్నది.

## హైదరాబాద్‌లో దారుణం..

### కుక్కల దాడిలో ఆరేండ్ల బాలుడు మృతి

హైదరాబాద్ : మియాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని మక్తాలో దారుణం జరిగింది. ఓ ఆరేండ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి చంపాయి. ఇవాళ ఉదయం మక్తాలోని నిర్మానుష్య ప్రాంతంలో బాలుడి మృతదేహం



లభ్యమైంది. బాలుడి తల్లిదండ్రులు స్థానికంగా భిక్షాటన చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. నిన్న రాత్రి ఆడుకుంటూ బయటకు వెళ్లిన బాలుడు కనిపించకుండా పోయాడు. దీంతో అప్రమత్తమైన తల్లిదండ్రులు బాలుడి అదృశ్యంపై మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికంగా ఉండే డంపింగ్ యార్డు వద్ద కుక్కలు అధికంగా ఉన్నాయి. దాంతో అక్కడికి వెళ్లి చూడగా, బాలుడి మృతదేహం కనిపించింది. బాలుడి శరీరమంతా గాయాలు ఉన్నాయి. మృతుడు తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## తల్లితండ్రులను మించిన దైవం లేదు....



విబారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:–జూన్ 5 మనల్ని కని పెంచిన తల్లితండ్రుల కన్నా మించిన దైవం మరేది లేదని, మనకు ప్రాణం పోసిన తల్లితండ్రులు వృద్ధాప్యంలో ఉన్నప్పుడు వారి ఆలనా పాలన, వారిని బాగా చూసుకోవడం మన బాధ్యతని స్ఫూర్తి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీసంగుంతల మధు అన్నారు. డోన్ పట్టణం తారకరామ నగర్ లో కుటుంబ ఆదరణ కోల్పోయి ఒంటరిగా జీవిస్తూ నిస్సహాయ స్థితిలో ఉన్న బెస్త వెంకట లక్ష్మిదేవి అనే వృద్ధురాలిని స్థానికుల సమాచారం మేరకు ఆ వృద్ధురాలి సంరక్షణ నిమిత్తం స్థానిక గుత్తి రోడ్డులో గల పద్మావతి వృద్ధాశ్రమంలో చేర్పించడం జరిగింది. ఆశ్రమంలో చేరిన వృద్ధురాలు తనవాళ్ళను తలుచుకొని కన్నీటి పర్యంతమయ్యారు. వృద్ధురాలికి అడిగిన వెంటనే ఆశ్రయం ఇచ్చిన ఆశ్రమ నిర్వాహకులు పద్మకు స్ఫూర్తి సభ్యులు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి సభ్యులు అంజియాదవ్, మోహన్ రెడ్డి, గోగుల హరీష్ తదితరులు పాల్గొన్నారు

## వర్షాకాలంలో అంటు వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...నరసాపురం పిహెచ్. సి వైద్యాధికారి.. డాక్టర్ బాబు

ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 05 విభారె న్యూస్ :– గ్రామాలలో ప్రస్తుత వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని రుద్రవరం మండలం నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాబు సూచించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలోని



ప్రజలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచించిన జాగ్రత్తలను గురించి వివరించారు. గ్రామాలలో అంటూ వ్యాధులు ప్రబలకుండా పలు కీలక సూచనలు చేశారు. ప్రస్తుత వర్షాకాలంలో పల్లెటూర్లలో పారిశుద్ధ్య లోపం వల్లడెంగ్యూ, మలేరియా, మెదడువాపు చికెన్ గున్యా , బోదకాలు తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా దోమల వల్ల ఈ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉన్నందువల్ల ముఖ్యంగా దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. దోమల నివారణ కోసం వైద్య ఆరోగ్యశాఖ ప్రతి శుక్రవారం "ఫ్రైడే డ్రైడే"కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తుందన్నారు. నివాస ప్రాంతాలలో నీరు నిలవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ బాబు సూచించారు. నీరు నిలవ ఉండే ప్రాంతాలను ఇసుక మట్టితో కప్పివే యాలని ఆయన సూచించారు. వేస్ట్ ఆయిల్ తో తడిపిన రంపపు పొట్టును కూడా వేయవచ్చన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా వేస్ట్ ఆయిల్, డీజిల్ కిరోసిన్ వంటి ద్రావణాలను గుంటలలో పిచికారి చేయాలని డాక్టర్ బాబు తెలిపారు. సాయంత్రం వేళల్లో దోమల ఇంటిలోకి ప్రవేశించకుండా కిటికీలను మూసివేయడం దోమల ప్రవేశించకుండా మెష్ లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కలుషిత ఆహారానికి దూరంగా ఉండాలి..ముఖ్యంగా అంటూ వ్యాధులు ప్రబల కుండా ఉండాలంటే ప్రజలు కలుషిత నీరు, ఆహారానికి దూరంగా ఉండాలని డాక్టర్ బాబు సూచించారు. వేడిగా తాగునీరు కూడా కాచి వడబోసి చల్లార్చి తాగడం ద్వారా మంచి ఉపయోగాలు ఉంటాయని ఆయన తెలిపారు. డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధి లక్షణాలు కనబడితే ప్రారంభ దశలోనే సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లడం ద్వారా వ్యాధి తీవ్రత ఎరగకుండా నిరోధించవచ్చన్నారు. నరసాపురం పి.హెచ్. సి పరిధిలో ప్రజలకు తాము ఎల్లవేళలా అందుబాటులో ఉండి ఆరోగ్య సంరక్షణకు కృషి చేయడం జరుగుతుందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాబు తెలిపారు..

## రవాణా శాఖ ప్రక్షాళన షురూ...

నిజామాబాద్, జూన్ 5, (న్యూస్ పల్స్) తెలంగాణలో పలు జిల్లాలలో ఆర్టీఓ కార్యాలయాలలో , బోర్డర్ చెక్ పోస్ట్ లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు చేశారు. నల్గొండ, కరీంనగర్, మహబూబాబాద్, సిద్ధిపేట, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలలోని రోడ్డు రవాణా శాఖ కార్యాలయాలపై ఒకేసారి అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు చేశారు. ఆర్టీఏ ఏజెంట్లు, ఆఫీసర్లను విచారిస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో ఇన్నాళ్లూ అడ్డూ అదుపూ లేకుండా సాగిన రవాణా శాఖ అధికారుల ఆగడాలు తారాస్థాయికి చేరుకున్నాయి. దాదాపు గత ఐదారేళ్లుగా రాష్ట్రంలోని ఆర్టీఏ కార్యాలయాలు, చెక్ పోస్టులలో భారీ ఎత్తున అవినీతి కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఏసీబీ మంగళవారం జరిపిన దాడుల్లో విస్తుపోయే అంశాలు బయటపడ్డాయి. ఏకంగా కార్యాలయాలలోనే పెద్ద మొత్తంలో డబ్బులు దొరికాయి. ఇన్ని జరుగుతున్నా ఆర్టీఏ ఉన్నతాధికారులు మౌనంగా ఉన్నారంటే క్షేత్ర స్థాయిలో జరిగే తంతు మొత్తం వీళ్లకి తెలిసే జరుగుతోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రవాణా శాఖలో ఆన్ లైన్ సర్వీసులు అంటూ ఎంత ఊదరగొట్టినా..ఆర్టీఏ బ్రోకర్లదే హవా. ఆర్టీఏ శాఖలో కొందరు ఉన్నతాధికారులు ప్రైవేటుగా కొందరు బ్రోకర్లను నియమించుకుని వాహనదారులనుంచి అడ్డగోలుగా లంచాలు వసూళ్లు చేయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. యావరేజ్ న ఒక్కో చెక్ పోస్ట్ లో ఏడాదికి ఆరు నుంచి ఎనిమిది కోట్ల మేరకు అవినీతి జరుగుతోందని అంచనా. పర్మినెంట్ డ్రైవింగ్ లైసెన్స్ కావాలంటే టూ వీలర్ కు ఓ రేటు, కారుకు మరో రేటు, స్కూళ్లు, కాలేజీల వంటి బస్సుల లైసెన్స్ లకు మరో రేటు, రవాణా వాహనాల ఫిట్ నెస్ రెన్యువల్ కు ఓ రేటు, లెర్నర్ లైసెన్సుకు కంప్యూటర్ పరీక్షకు ఓ రేటు చొప్పున వసూలు చేస్తున్నారు. ఒకవేళ వాహనదారులు నేరుగా వెళితే ఏదో ఒక సాకు చెప్పి వాళ్లను మళ్లీ మళ్లీ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ చివరాఖరికి బ్రోకర్లే శరణ్యం అనేటట్లు చేస్తున్నారు. ఇలా బ్రోకర్ల ద్వారా వెళ్లే అప్లికేషన్లకు పెన్సిల్ తో ఓ కోడ్ ఉంటుంది. ఆ కోడ్ చూడగానే వెంటనే పనులు చకచకా అయిపోతాయి. అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు సైతం అక్రమాలకు అడ్డాగా మారాయి. తెలంగాణ–ఆంధ్రా సరిహద్దులో ఉన్న అశ్వారావుపేట చెక్ పోస్టులో భారీ ఎత్తున అవినీతి జరుగుతోంది. ఇక్కడ సంవత్సరానికి ఏడు నుంచి ఎనిమిది కోట్ల అవినీతి జరుగుతోందని అంచనా. అప్లికేషన్లు, అనుమతులు అన్నీ కరెక్ట్ గానే ఉన్నాయంటూ లంచం ఇవ్వకుండా వెళుతున్నా లారీలను వెంబడించి కేసులు పెట్టి వాళ్ల నుంచి 20 వేల రూపాయలు జరిమానాలు విధిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అలాగే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో బడి బస్సులు, లారీలు వంటి భారీ వాహనాలకు ఫిట్ నెస్ రెన్యువల్ సర్టిఫికెట్లు కేవలం బ్రోకర్ల ద్వారా వస్తేనే పనులు జరుగుతున్నాయిరంగారెడ్డి జిల్లాలో ఓ కీలక కార్యాలయానికి కొద్దినెలల క్రితం కొత్త అధికారి వచ్చాక ప్రైవేటు వ్యక్తులను ఆర్టీఏ కార్యాలయంలోకి అనుమతించడం ఆపేశారు. సదరు అధికారి సెలవులో ఉన్నప్పుడు కిందిస్థాయి అధికారులు దళారులకు ఎర్రతివాచీ పరుస్తున్నారు. పాత వాహనాలకు యజమాని వివరాలు మార్చాలన్నా ఇక్కడ డబ్బు ముట్టజెప్పాల్సిందే. వాహనాల ఫిట్ నెస్ పరీక్షకు ఆటోకు రూ.300, ట్రాక్టర్ కు రూ.500 చొప్పున ఇవ్వాలి. కామారెడ్డి జిల్లాలో ఓ అంతర్రాష్ట్ర చెక్ పోస్టులో కొద్ది కాలం క్రితం ఏకంగా 21 మంది రవాణా అధికారులు డిప్యూటేషన్ పై కొనసాగారు. హై లెవెల్ పైరవీలతో చాలాకాలం పాటు తిష్టవేసిన వారిని ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి పింపింది. ఇక్కడ ఉన్న ఉన్నతస్థాయి అధికారులు దాదాపు 20 మంది ప్రైవేటు సిబ్బందిని నియమించుకున్నారు. వారి ద్వారా రోజుకు 15 లక్షలకు పైగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇలా చూసుకుంటే ఆర్టీఏ శాఖలో ఇలాంటి వసూల్ రాజాలను ప్రోత్సహించింది బీఆర్ఎస్ సర్కారే అన్నది అర్థమవుతోంది. తెలంగాణలో అవినీత రహిత పాలన అందిస్తామని, అవినీతికి ఎవరు పాల్పడినా ఉపేక్షించమని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు అనుగుణంగా అవినీతి నిరోధక శాఖ అధికారులు అడుగులు వేస్తున్నారు. ఆ ప్రక్రియలో భాగంగానే దశాబ్దాలుగా ఆర్టీఓ కార్యాలయాలలో పేరుకుపోయిన లంచగొండుల పనిపట్టే పనిలో ఉన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో లంచాలతో బదిలీలను ఆపుకుంటూ ఏళ్ల తరబడి ఒకే చోట తిష్టవేసుకుని కూర్చున్న అధికారులకు ఇకపై రాష్ట్ర ప్రభుత్వం చుక్కలు చూపించనుంది.

# అత్యధిక.. అత్యల్ప మెజార్టీలు

విజయవాడ, జూన్ 5, ఏపీ ఎన్నికల్లో కూటమి సూపర్ హిట్ అయింది. టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు దుమ్మురేపారు. వైసీపీకి ఊచకోత కోశారు. గెలిచిన అభ్యర్థుల్లో కొందరు ప్రత్యర్థులను చిత్తు చేసి భారీ మెజారిటీ సొంత చేసుకోగా... మరికొందరు అభ్యర్థులకు అత్యల్ప మెజారిటీతో కష్టమ్మీద విజయాన్ని ముద్దాడారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వంటి వారు భారీ మెజారిటీతో గెలిచిన వారిలో ఉండగా స్వల్ప తేడాతో ఓడిపోయిన వారిలో ధర్మవరం సిటింగ్ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఉన్నారు. ఆ విశేషాలు మీకోసం.

అత్యధిక మెజారిటీతో గెలిచిన అభ్యర్థులు వీరే..

విశాఖ జిల్లా గాజువాక నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాస్ రావు తన సమీప వైకాపా అభ్యర్థి గుడివాడ అమర్ నాథ్ పై 95,235 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచారు. శ్రీనివాస్ రావుకు 1,57,703 ఓట్లు రాగా అమర్ నాథ్ కు 62,466 ఓట్లు మాత్రమే వచ్చాయి.

విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు తన సమీప వైకాపా అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుపై 92,401 ఓట్ల మెజారిటీతో గెలిచారు. గంటాకు 1,76,230 ఓట్లు కాగా ముత్తంశెట్టికి 83,829 ఓట్లు వచ్చాయి.

గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 91,413 ఓట్ల భారీ మెజారిటీతో తన సమీప వైసీపీ అభ్యర్థి మురుగుడు లావణ్యపై గెలుపొందారు. లోకేశ్ కు 1,67,710 ఓట్లు రాగా, లావణ్యకు 76,297 ఓట్లు వచ్చాయి.

కాకినాడ రూరల్ నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి పట్నం వెంకటేశ్వరరావు (1,34,414) సమీప వైసీపీ అభ్యర్థి కురసాల కన్నబాబు(62,374)పై 72,040 ఓట్ల మెజారిటితో గెలిచారు.

నెల్లూరు సిటీ నియోజకర్గంలో టీడీపీ అభ్యర్థి నారాయణ (1,20,551) తన సమీప వైకాపా అభ్యర్థి ఖలీల్ అహ్మద్(48,062)పై 72,489 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు.

రాజమండ్రి సిటీ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ (1,23,291) తన సమీప వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్ రామ్(51,887)పై 71,404 ఓట్ల తేడాతో గెలిచారు.

కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ (1,34,394) తన సమీప వైసీపీ అభ్యర్థి వంగా గీత(64,115)పై 70,279 ఓట్ల మెజారిటీతో గెలిచారు.

అత్యల్ప మెజారిటీతో గెలిచిన అభ్యర్థులు వీరే..

శ్రీ సత్యసాయి జిల్లాలోని మడకశిర (ఎస్ సీ) నియోజకవర్గానికి చెందిన టీడీపీ అభ్యర్థి ఎం ఎస్ రాజు 351 ఓట్ల అత్యల్ప మెజారిటీతో సమీప వైసీపీ అభ్యర్థి ఇరలక్కప్పపై విజయం సాధించారు. రాజుకు 79,983 ఓట్లు రాగా ఇరలక్కప్పకు 79,632 ఓట్లు లభించాయి.

ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్ రెడ్డి తన సమీప అభ్యర్థి కుందురు నాగార్జున రెడ్డిపై 973 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అశోక్ రెడ్డికి 98,463 ఓట్లు రాగా, నాగార్జున రెడ్డికి 97,490 ఓట్లు వచ్చాయి.

అన్నమయ్య జిల్లాకె? చెందిన రాయచోటి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి మందిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి సమీప వైసీపీ అభ్యర్థి గడికోట శ్రీకాంత్ రెడ్డిపై 2,495 ఓట్ల మెజారిటీతో గెలిచారు. రాంప్రసాద్ రెడ్డికి 95,925 ఓట్లురాగా, శ్రీకాంత్ రెడ్డికి 93,430 వచ్చాయి.

తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం సమీప వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేశ్ పై 3,739 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఆదిమూలానికి 85,471 ఓట్లు రాగా రాజేశ్ కు 81,732 ఓట్లు వచ్చాయి.

శ్రీ సత్యసాయి జిల్లా కి చెందిన ధర్మవరం నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ తన సమీప వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై 3,734 ఓట్ల మెజారిటీతో గెలిచారు. సత్యకుమార్ కు 1,06,544 ఓట్లురాగా, కేతిరెడ్డికి 1,02,810 ఓట్లొచ్చాయి. కేతి రెడ్డి సామాజిక మాధ్యమాల్లో యాక్టివ్ గా ఉండటమే కాకుండా హాలో ధర్మవరం కార్యక్రమంలో ప్రజలకు చేరువైనప్పటికీ కూటమి హవాలో ఓటమి చవిచూడక తప్పలేదు.

ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి తన సమీప టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మిపై 2,456 ఓట్ల మెజారిటీ తో గెలిచారు. శివప్రసాద్ రెడ్డికి 1,01,889 ఓట్లు రాగా లక్ష్మికి 99,433 ఓట్లు వచ్చాయి.

కర్నూలు జిల్లాలోని ఆలూరు నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి బి. విరూపాక్షి2,831 ఓట్లతో సమీప టీడీపీ అభ్యర్థి బి. వీరభద్ర గౌడ్ పై విజయం సాధించారు. విరూపాక్షికి 1,00,264 ఓట్లు రాగా వీరభద్ర గౌడ్ కి 97,433 ఓట్లు వచ్చాయి.

# పడిన చోటే వెతుక్కున్న పవన్



గుంటూరు, జూన్ 5, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన అధినేత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఘన విజయాన్ని సాధించాడు. 70 వేల పై చిలుకు మెజార్టీ ఓట్ల తో భారీ విక్టరీని సాధించడమే కాకుండా పిఠాపురం ఎమ్మెల్యేగా తన మార్కు చూపించడానికి రెడీ అవుతున్నాడు. 2019 వ సంవత్సరంలో రెండు స్థానాల నుంచి పోటీ చేసిన పవన్ కళ్యాణ్ ఒక్క స్థానంలో కూడా గెలుపొందకపోవడంతో వైసీపీ నాయకులు పవన్ కళ్యాణ్ ని తీవ్ర స్థాయిలో విమర్శించారు.ఇక ఈ దెబ్బ తో పార్టీని పక్కన పెట్టేసి రాజకీయాల నుంచి వెళ్ళిపోతాడు అని అందరూ అనుకున్నారు. అలా చేస్తే ఆయన పవన్ కళ్యాణ్ ఎందుకు అవుతాడు? ఎటు వెళ్లకుండా అపోజిషన్ గా నిలబడ్డాడు.. ప్రభుత్వం చేసే పనులను ఎండగట్టాడు. ఇక రోజులు గడిచే కొద్ది పవన్ కళ్యాణ్ గొప్పతనం ఏంటో అక్కడి ప్రజలకు అర్థమైంది. అందుకే జగన్ పాలనకు స్వస్తి పలుకుతూ పవన్ కళ్యాణ్ ని భారీ మెజార్టీతో గెలిపించారు. దాంతో మొదటిసారి పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేగా గెలిచి ఘన విక్టరీని కూడా సాధించాడు. ఇక ఇంతకు ముందు వైసిపి ప్రభుత్వం పవన్ కళ్యాణ్ ని ఇబ్బందులకు గురి చేసిన విషయం మనకు తెలిసిందే. ఆయన సినిమాలు రిలీజ్ చేయకుండా ఆపేసింది. రిలీజ్ అయిన సినిమా టిక్కెట్ల ధరలు తగ్గించి ఆయన సినిమాలకి కలెక్షన్స్ రాకుండా చేశారు.తద్వారా తను పార్టీ ని నడుపుకోలేని స్థితికి చేరుకొని రాజకీయాల నుంచి వైదొలగాలనే ఒక కుట్రను పన్నారు. ముగ్గురు పిల్లలు అంటూ హేళన చేశారు. అయినప్పటికీ తన గెలుపుని ముందే ఊహించిన పవన్ కళ్యాణ్ వాళ్ల అరాచకాలను ఓపిక పట్టుకుంటూ ముందుకు సాగాడు. మొత్తానికైతే వైసీపీ పార్టీ కి మొగుడుగా మారి భారీ విజయాన్ని సాధించాడు? ఇక తన కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపుతూ, తను ఇబ్బంది పడిన కూడా తన పక్కవారిని ఇబ్బంది పెట్టకుండా తను ఎక్కడ కృంగిపోకుండా, అడుగు ఎక్కడ తడబడకుండా, ప్రయాణించే చీకటి దారిలో ఎన్నో ప్రళయాలు, ప్రవాహాలు, విపత్తులు, విగదాలు, అరాచకాలు, అకృత్యాలు ఎదురైనప్పటికి వాటన్నింటినీ దాటుకొని ఈరోజు కోసం ఎన్నో నిద్రలేని రాత్రులను కూడా గడిపాడు. తను తలుచుకుంటే లగ్జరీ లైఫ్ ను అనుభవిస్తూ రోజుకు రెండు కోట్లు తీసుకుంటూ హాయిగా సినిమాలు చేసుకుంటూ జీవితాన్ని కొనసాగించవచ్చు. కానీ పేద ప్రజలకు ఏదో ఒకటి చేయాలి. ఈ రాష్ట్రానికి పట్టిన దారిద్రాన్ని వదిలించాలనే ఒకే ఒక కాన్సెప్ట్ తో ముందుకు కదిలిన పవన్ కళ్యాణ్ ఈరోజు ఎమ్మెల్యేగా నిలబడ్డాడు. తన పార్టీ అభ్యర్థులను కూడా గెలిపించుకోగలిగాడు.ఇక పవన్ కళ్యాణ్ గెలుపు చాలామందికి మార్గదర్శకంగా మారింది. ఎక్కడ పడ్డాడో అక్కడే నిలబడి చూపించాడు. ఎవరైతే అసెంబ్లీ కి రానివ్వం అన్నారో వాళ్ళనే అసెంబ్లీ గేటు కూడా తాకకుండా చేశాడు. ఆయన్ని విమర్శించిన వాళ్ళ అడ్రన్ లు గల్లంతయిపోయేలా చేశాడు..ఓటమిని ఒప్పుకోలేని వాడే గెలుస్తాడు అనేది మాత్రం వాస్తవం..

# కనీవినీ ఎరుగని విజయం...



విజయవాడ, జూన్ 5, ఒక అసాధ్యం సుసాధ్యమైన సమయమిది. చరిత్ర తిరగరాసిన విజయమిది. కనీవినీ ఎరుగని గెలుపు ఇది. ఎన్నెన్నో రికార్డులు బద్దలైన సందర్భమిది. కూటమిగా వచ్చి ప్రత్యర్థి ఖేల్ ఖతం చేసిన ఎన్నిక ఇది. ఆంధ్రాలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి చేసిన మ్యాజిక్ అంతా ఇంతా కాదు. వార్ వన్ సైడే అంటే ఇదే. 175 స్థానాల్లో ఏకంగా 164 సాధించడం అంటే మాటలు కాదు. వైఎస్ఆర్ కాంగ్రెస్ కు ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా సాగిన విజయమిది. ఎన్నడూ దక్కని నియోజకవర్గాలు టీడీపీ వశమయ్యాయి.ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వైసీపీకి దిమ్మ తిరిగి మైండ్ బ్లాంక్ చేశాయి. వై నాట్ 175 అంటూ రంగంలోకి దిగిన జగన్ కు ఫలితాలు ఊహించని షాక్ ను ఇచ్చాయి. టీడీపీ కూటమి వార్ వన్ సైడ్ చేసేసింది. ప్రత్యర్థి పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కనంతగా ఫలితం వచ్చింది. ఈ గెలుపు అసాధారణం. వైసీపీ 175 సీట్లలో పోటీ చేయగా.. ఎన్డీయే కూటమిలోని తెలుగుదేశం పార్టీ 144, జనసేన 21, బీజేపీ 10 అసెంబ్లీ సీట్లలో పోటీ చేశాయి. ఫలితాల్లో మాత్రం టీడీపీ, జనసేన, బీజేపీ స్ట్రైక్ రేట్ ఓ రేంజ్ లో ఉంది. జనసేన అయితే 100 శాతం స్ట్రైక్ రేట్ తో పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ విజయం సాధించింది. 175 అసెంబ్లీ స్థానాల్లో 165 చోట్ల గెలుపొందింది టీడీపీ కూటమి. 136 చోట్ల సైకిల్ పార్టీ, 21 స్థానాల్లో జనసేన, బీజేపీ 8 సీట్లలో గెలుపొందాయి. అసలు పొలిటికల్ పండింట్స్ కు కూడా అందని లెక్క ఇది. పోలింగ్ పర్సెంటేజ్ పెరగడంతో ఈసారి లెక్కలు తారుమారవుతాయన్న అంచనాలు పెరిగాయి. అనుకున్నట్లుగానే ఫలితం వచ్చింది. అధికారం చేతులు మారింది.ఎన్నో విమర్శలు, ఇంకెన్నో సవాళ్ల మధ్య పోటీకి దిగిన కూటమి ఘన విజయం సాధించింది. చంద్రబాబు-పవన్ జోడీ జనంలో చాలా ఎఫెక్ట్ చూపించింది. ఇక ఆంధ్రా గాడిన పడాలంటే బాబు మళ్లీ రావాల్సిందే అన్న పాయింట్ జనంలోకి బలంగా వెళ్లింది. బాబు షూరిటీ ? భవిష్యత్ కు గ్యారెంటీ అన్న ప్రచారం ప్రజలను ఆలోచింపజేసింది. రాజధాని లేని రాష్ట్రంగా మారిన ఏపీకి దశ దిశ చూపించే బాధ్యతను టీడీపీ కూటమిపై పెట్టారు జనం. ఈస్ట్, వెస్ట్ నార్త్ సౌత్.. కార్నర్ ఏదైనా టీడీపీ కూటమిదే ఘన విజయం అన్నట్లుగా తొలి రౌండ్ నుంచే ఆధిక్యం కొనసాగింది. ఉత్కంఠ పోరు ఉంటుందనుకున్నారు. కానీ కౌంటింగ్ మొదలయ్యాక సీన్ కూటమివైపు మారిపోయింది.ఏళ్ల వయసులో చంద్రబాబు తన విశ్వరూపాన్ని మరోసారి చూపించారు. మండే ఎండలు, జోరు వర్షాలను లెక్కచేయకుండా, గొంతులో వాయిస్ బేస్ తగ్గకుండా చేసిన ప్రచారం, అందుకు స్పందించిన జనం, వచ్చిన ఫలితం ఇవన్నీ మరపురానివే. ముసలోడు అని గేలి చేసిన వారు నోరెళ్ల బెట్టేలా ఒంటిచేత్తో ప్రచారాలు హోరెత్తించారు. అగ్నికి వాయువు తోడైనట్లుగా జనసేనాని పవన్ కల్యాణ్ మాటల తూటాలతో చెలరేగిపోయారు. పేదలకు, పెత్తందారులకు మధ్య పోటీ అంటూ జగన్ చేసిన ప్రకటనను సవాల్ గా తీసుకుని నిజమైన పెత్తందారు ఎవరో ప్రజలకు వివరించటంలో సక్సెస్ అయ్యారు.తగ్గాల్సిన చోట తగ్గారు. నెగ్గాల్సిన చోట నెగ్గారు. అందుకే ఈ ప్రజా విజయం సాధ్యమైంది. 2021 నవంబర్ 19న ఏపీ అసెంబ్లీలో జరిగిన ఘటనతో కలత చెందిన చంద్రబాబు మళ్లీ సీఎం అయ్యాకే సభకు వస్తానని ఆనాడే శపథం చేశారు. ఇప్పుడు మళ్లీ ఘన విజయం సాధించడం ద్వారా తన పంతం నెగ్గించుకున్నారు. అటు ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా మొదటి నుంచి పవన్ కల్యాణ్ నెరిపిన మంత్రాంగం ఫలించింది. పొత్తులు పెట్టుకుంటేనే గెలుస్తాం అని చెప్పి అటు ఢిల్లీని, ఇటు చంద్రబాబును ఒప్పించి సక్సెస్ అయ్యారు జనసేనాని.ఏపీలోని 25 ఎంపీ స్థానాల్లోనూ 25 సీట్లకు గానూ కూటమి 21 సీట్లు సాధించింది. టీడీపీ 16, బీజేపీ 3, జనసేన 2 చోట్ల గెలిచాయి.


# గేమ్ చేంజర్ గా పవన్

**100 శాతం స్ట్రైక్ రేట్...**

కాకినాడ, జూన్ 5, ఏపీ ఎలక్షన్స్ లో గేమ్ చేంజర్ గా మారిన పవన్ కళ్యాణ్ తన పార్టీ పోటీ చేసిన ప్రతి చోట తన అభ్యర్థులను గెలిపించుకొని తన స్టామినా ఎంటో ప్రూవ్ చేసుకున్నాడు. ఇక ఇంతకుముందు వైసీపీ వాళ్లు పవన్ కళ్యాణ్ కి రాజకీయం చేసేంత నైపుణ్యం లేదు అంటూ విమర్శలైతే చేశారు. కానీ పవన్ కళ్యాణ్ తన రాజకీయ చతురతతో వార్ వన్ సైడ్ చేసేశాడు. ఇక మొత్తానికైతే వైసీపీని దారుణంగా ఓడించడమే కాకుండా కూటమిని గెలుపు పీఠాలెక్కించాడు. ఇక ఫైనల్ గా పవన్ కళ్యాణ్ అనుకున్నది సాధించాడు. ఇక ఈ ఎలక్షన్స్ లో అధికార పార్టీకి వ్యతిరేకంగా ఉన్న ఏ ఒక్క ఓటు కూడా చీలకూడదనే ఉద్దేశ్యంతోనే పవన్ కళ్యాణ్ దగ్గరుండి మరి ఈ కూటమిని ఏర్పాటు చేశాడు.నిజానికి అమిత్ షా చంద్రబాబుతో కలవడానికి అసలు ఇష్టపడలేదట.. ఎందుకంటే 2019 వ సంవత్సరంలో చంద్రబాబు కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకొని బిజెపి ని చాలా రకాలుగా ఇబ్బందులకు గురి చేశాడు. ఆ పార్టీ పైన తీవ్రమైన వ్యాఖ్యలను కూడా చేశాడు. ఇక ఇంకోసారి చంద్రబాబుతో పొత్తు పెట్టుకోకూడదని అమిత్ షా స్ట్రాంగ్ గా ఫిక్స్ అయ్యాడట. కానీ పవన్ కళ్యాణ్ మాత్రం పొత్తు ఉంటే వైసీపీ ని గద్దె దించొచ్చనే ఉద్దేశ్యంతోనే అందర్నీ కలిపి ఒక కూటమిని తయారు చేశాడు. ఇక దీనివల్ల పవన్ కళ్యాణ్ కు వచ్చే ప్రయోజనం కంటే కూడా రాష్ట్ర ప్రజలకు ఎక్కువగా మేలు జరుగుతుంది. నిజానికి ఇంతకుముందు వైసీపీ బిజెపి రెండు పొత్తులో ఉండేవి..ఇక ఇప్పుడు కొత్త గవర్నమెంట్ ఏర్పడితే వైసీపీ కి బిజెపి సపోర్టుగా ఉంటుందని పవన్ గ్రహించాడు. దీనివల్ల జగన్ కేసుల విషయంలో బిజెపి మళ్ళీ తనని ఆదుకుంటుందేమోననే ఉద్దేశ్యం తోనే పవన్ కళ్యాణ్ స్కెచ్ వేశాడు. జగన్ నుంచి బిజెపి పార్టీని వేరుచేసి తమ కూటమిలో కలిసిపోయేలా చేశాడు. ఇక ఇప్పుడు జగన్ మీద ఉన్న కేసులన్నింటిని బట్టబయలు చేయొచ్చు. అలాగే వీలైతే జగన్ ని మళ్లీ జైలుకు కూడా పంపించొచ్చు అనే ఉద్దేశ్యం తోనే పవన్ కళ్యాణ్ ఈ పొత్తు పెట్టుకున్నాడు.ఇక జగన్ వల్ల అన్యాయం జరిగిన వాళ్ళకి న్యాయం జరగాలంటే వైసీపీ అధినేత జైల్లో ఉండాల్సిందే అని నిర్ణయించుకున్న పవన్ కళ్యాణ్ ఈ రకంగా వ్యూహా పూరితమైన రాజకీయ ప్రణాళికను రూపొందించాడనే చెప్పాలి. పోటీ చేసిన అన్ని చోట్లా విజయం సాధించింది జనసేన పార్టీ. కూటమిలో భాగంగా 21 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ సీట్లలో పోటీ చేసింది. వంద శాతం కాకపోయినా పదిహేను సీట్లు గెలుస్తారని అందరూ అంచనా వేశారు. ఎందుకంటే.. తీసుకున్న సీట్లలో పాలకొండ, పోలవరం, రైల్వే కోడూరు వంటి కొన్ని క్లిష్టమైన సీట్లు ఉన్నాయి. అయినప్పటికీ ప్రజలు కూటమికి పట్టం కట్టారు. ఈ క్రమంలో అన్ని సీట్లలో జనసేన పార్టీ ఘన విజయం సాధించింది. వైసీపీకి ఇప్పుడు 9 మంది ఎమ్మెల్యేలు ఉంటే.. జనసేనకు 21 మంది ఎమ్మెల్యేలు ఉంటారు. ప్రతిపక్ష హోదా కూడా వైసీపీకి దక్కలేదు. కావాలనుకుంటే పవన్ కళ్యాణ్ ప్రతిపక్ష నేత హోదాలో ఉంటారు. పార్లమెంట్ ఎన్నికల విషయంలోనూ జనసేన పార్టీ రికార్డు సృష్టించింది.

# ముద్రగడ పేరు మార్చుకుంటారా...

కాకినాడ, జూన్ 5, ముద్రగడ పద్మనాభం ఇప్పుడు సోషల్ మీడియాకు టార్గెట్ అయ్యారు. పవన్ పిఠాపురంలో ఓడిపోతే తాను పేరు మార్చుకుంటానని ముద్రగడ సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ఆ సవాల్ ను గుర్తు చేస్తూ సోషల్ మీడియాలో జనసైనికులు, నెటిజెన్లు ప్రశ్నించడం ప్రారంభించారు. వైసీపీలో చేరిన ముద్రగడ పవన్ ను టార్గెట్ చేసుకున్నారు. పిఠాపురంలో పవన్ ఓడిస్తానని శపథం చేశారు. అంతటితో ఆగకుండా పవన్ గెలిస్తే తాను ముద్రగడ పద్మనాభ రెడ్డి గా పేరు మార్చుకుంటానని కూడా సవాల్ చేశారు. అది కూడా మీడియా ముఖంగానే. ఇప్పుడు ఏపీలో కూటమి అధికారంలోకి రావడం,



పిఠాపురంలో పవన్ భారీ మెజారిటీతో గెలవడంతో జనసైనికులు ముద్రగడను టార్గెట్ చేయడం ప్రారంభించారు.ముద్రగడ పద్మనాభం ఒకానొక దశలో జనసేనలో చేరతారని ప్రచారం జరిగింది. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు కూడా చేసుకున్నారు. కానీ పవన్ ఆహ్వానించపోయేసరికి చిన్నబుచ్చుకున్నారు. నేరుగా తాడేపల్లి కి వెళ్లి జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. అటు జగన్ సైతం పిఠాపురం బాధ్యతలను ముద్రగడకు అప్పగించలేదు. ఆయన కుమారుడికి ఎటువంటి టిక్కెట్టు కేటాయించలేదు. వైసీపీ అధికారంలోకి వస్తే రాజ్యసభ పదవి ఆఫర్ చేసినట్లు ప్రచారం జరిగింది. అయితే వైసీపీలో చేరిన నాటి నుంచి ముద్రగడ పవన్ ను టార్గెట్ చేసుకోవడం ప్రారంభించారు. పిఠాపురంలో పవన్ ను ఓడిస్తానని.. అలా చేయకుంటే తన పేరును మార్చుకుంటారని కూడా చెప్పుకొచ్చారు. అయితే అనూహ్యంగా ముద్రగడ కుమార్తె నుంచి పవన్ కళ్యాణ్ కు మద్దతు లభించింది. ముద్రగడ చేసిన వ్యాఖ్యలను సొంత కుటుంబ సభ్యులు సైతం తప్పుపట్టారు.అయితే ఇప్పుడు పవన్ గెలుపుతో జనసైనికులు జోష్ తో ఉన్నారు. తెగ సందడి చేస్తున్నారు. ఈ తరుణంలో గతంలో ముద్రగడ చేసిన శపథాన్ని గుర్తు చేస్తున్నారు. పద్మనాభ రెడ్డి గా పేరు మార్చుకుంటారా అని ప్రశ్నిస్తున్నారు. ఉదయం జనసేన లీడింగ్ లోకి వచ్చిన నాటి నుంచి కొన్ని మీడియా ఛానల్స్ సైతం ముద్రగడ శపథాన్ని గుర్తుచేశాయి. దీంతో ఇవి విపరీతంగా వైరల్ అయ్యాయి. అయితే సీఎం జగన్ ఇప్పటికే తన పదవికి రాజీనామా చేశారు. అటు ఓటమిపై స్పందించేందుకు వైసిపి నేతలు ఎవరు ముందుకు రావడం లేదు. మరి ముద్రగడ పద్మనాభం ఆ శపథంపై ఎటువంటి ప్రకటన చేస్తారో? అన్నది తెలియాల్సి ఉంది.

# ఇక పొలిటికల్ ప్రిడిక్షన్స్ ఉండవు

విజయవాడ, జూన్ 5, వేణు స్వామి.. అయితే కాషాయం లేకుంటే పసుపు వర్ణంలో దుస్తులు ధరిస్తాడు. జాతకాలు చెబుతుంటాడు. హీరోయిన్ల పేర్లు మార్చుతుంటాడు. ఒకప్పుడు ఇతన గురించి. అంతగా తెలిసేది కాదు. సోషల్ మీడియా వ్యాప్తి పెరిగిన తర్వాత ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాడు. సెలబ్రిటీ అయిపోయాడు. దీంతో అతడు తనను తాను దైవం సంభూతుడిగా చెప్పుకోవడం మొదలుపెట్టాడు. తను జాతకం చెబితే ఏదైనా జరుగుతుందని.. తన చేతికి మహార్జాతకం ఉందని ప్రచారం చేసుకోవడం ప్రారంభించాడు. అక్కడితోనే అతడు ఆగలేదు. జాతకాలు చెప్పడం మొదలుపెట్టాడు.. ఏం జరగబోతుందో అంచనా వేయడంలో సిద్ధహస్తుడయ్యాడు. అందులో అతడు చెప్పినవి కొన్ని జరిగాయి. దీంతో ఒక్కసారిగా ఓవర్ నైట్ స్టార్ అయిపోయాడు.. సహజంగానే అంత పేరు వచ్చింది కాబట్టి అతడికి హిపోక్రసీ పెరిగింది. అది అతనిలో అహాన్ని మరింతగా పెంచింది.ఇటీవల వేణు స్వామి తనకు తానుగా చెప్పిన ప్రిడిక్షన్లన్నీ ఎదురు తంతున్నాయి. స్వదేశంలో జరిగిన వన్డే వరల్డ్ కప్ లో భారత్ గెలుస్తుందని చెబితే.. ఫైనల్ మ్యాచ్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతారని అంటే.. ఆయన కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటమి పాలయ్యారు.. చివరికి ప్రభుత్వాన్ని కూడా ఏర్పాటు చేయలేకపోయారు.. ఇక ఐపీఎల్ లో హైదరాబాద్ జట్టు గెలుస్తుందని.. కావ్య జాతకం బాగుందని వేణు స్వామి అన్నారు.. కానీ కోల్ కతా చేతిలో దారుణమైన పరాజయాన్ని హైదరాబాద్ మూట కట్టుకుంది. ఏపీ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి గెలిచి, రెండవసారి ముఖ్యమంత్రి అవుతాడని వేణు స్వామి జాతకం చెబితే.. అది కూడా తప్పయింది. పైగా వైసిపి అత్యంత దారుణమైన ఓటమిని చవిచూసింది.ఇవేవీ జరగలేదు. పైగా అతను చెప్పిన తర్వాత ఆ వ్యక్తులు ఓటమి పాలయ్యారు. అతడు గెలుస్తాడని చెప్పిన జట్లు పరాజయం పాలయ్యాయి.. దీంతో సోషల్ మీడియాలో వేణు స్వామి చరిష్మా తగ్గింది. అతడి క్రేజ్ పడిపోయింది. స్థూలంగా చూస్తే అతడు మామూలు మనిషి అని తేలిపోయింది. ఇలా వరుసగా అతడు చెప్పిన విషయాలన్నీ అడ్డంగా తన్నడం మొదలు పెట్టడంతో సోషల్ మీడియాలో నెటిజెన్లు ఏకిపారేయడం మొదలుపెట్టారు.. దీంతో వేణు స్వామి తగ్గాడు. ఇన్నాళ్లపాటు ఆకాశంలో విహరించిన అతడు కిందికి దిగివచ్చాడు.మంగళవారం వెల్లడైన ఫలితాలలో ఏపీలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం దారుణమైన ఓటమిని మూటగట్టుకోవడంతో.. వేణు స్వామి బయటకు వచ్చాడు.. ఇకనుంచి తాను జాతకాలు చెప్పనని స్పష్టం చేశాడు. " కొద్దిరోజులుగా నన్ను కొంతమంది ట్రోల్ చేస్తున్నారు. నేను కేంద్రంలో మోడీ ప్రభావం తగ్గుతుందని చెప్పాను. అది నిజమైంది. చంద్రబాబు ఓడిపోతారని అన్నాను. జగన్ గెలుస్తారని చెప్పాను. కానీ అందుకు విరుద్ధమైన ఫలితాలు వచ్చాయి. నేను నక్షత్రాల ఆధారంగా, జాతకాల ఆధారంగా ప్రిడిక్షన్ చెబుతాను. ఇకనుంచి నేను చెప్పడం మానేస్తాను.

## రాఘవేంద్ర స్వామి ఆశీస్సులతో 4వ సారీ శాసనసభ్యులుగా ఎన్నిక..




మంత్రాలయంజూన్ 5 విభారే న్యూస్..మంత్రాలయం నియోజకవర్గంశాసనసభ్యునిగా 4వ సారీ ఎన్నికై నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించినందుకు నేను ఎంతో ధన్యుడినైనాను మంత్రాలయం శ్రీ గురు రాఘవేంద్ర స్వామి, మంచాలమ్మ వారి ఆశీస్సులతో హ్యాట్రిక్ సాధించినాను. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు ఎల్లవేళలా మా కుటుంబంపైఉంటాయని,నాకిచ్చినఈఅవకాశాన్ని ఇచ్చిన నియోజకవర్గ ప్రజల ఆశయాలను నా సాయ శక్తుల నెరవేరుస్తానని, రాష్ట్రంలో మాప్రభుత్వంలేనప్పటికీని నియోజకవర్గ సమస్యల కొరకు శాసనసభలో పోరాడి సమస్యలను పరిష్కరిస్తానని ఆయన తెలియజేశారు.

## అమావాస్య సందర్భంగా సూర్య దేవాలయంలో చండీ హోమం..

కర్నూలు జిల్లా ప్రతినిధి జూన్ 5 విభారె న్యూస్..గురువారం అమావాస్య సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఉదయం 9 గం.లకు నవగ్రహా, లక్ష్మీ గణపతి, మూల మంత్ర సహిత చండీహోమం నిర్వహించబడును. ఈ చండీహోమం చేసుకోవటం వలన సమస్త శత్రు, రుణ, రోగ, బాధలు తొలగి సకల కార్య జయం కలుగుతుంది. అమ్మవారి అనుగ్రహం వలన ఆయురారోగ్య ఐశ్వర్యములు సిద్ధించి చండీ పరదేవత అనుగ్రహం కలుగుతుందిహోమంప్రధానంగా:-4000/- సంక ల్పం:-116/- సంప్రదించవలసిన నెం :- డి.లక్ష్మీనరసింహ శర్మ:8008774086 దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు:8896123777.

## అమావాస్య సందర్భంగా కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు..



కర్నూలు జిల్లా ప్రతినిధి జూన్ 5 విభారె న్యూస్. నేడు గురువారం అమావాస్య సందర్భంగా సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి శత్రు నివారణ, బాల గ్రహ దోష నివారణ, శని గ్రహ దోష నివారణ, బుద్ధి,బలం, యశో,ధైర్యం, కార్యసిద్ధి,కొరకు ఉదయం 10 గంటలకు సింధూరార్చన జరుగును.పూజలో పాల్గొన్న భక్తులకు ఆంజనేయ స్వామి డాలరు సింధూరం ప్రసాదంగా ఇవ్వబడును.రుసుము 250-/ సంప్రదించవలసిన నెం: అశోక్ కుమారాచార్యులు 9032577369 దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు:8896123777.

## నేడు శనైశ్చర జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు..



కర్నూలు జూన్ 5 జిల్లా ప్రతినిధి విభారే న్యూస్..శనైశ్చర జయంతిని ఏటా వైశాఖ అమవాస్య తిథినాడు శనీశ్వరుడి జయంతి నిర్వహిస్తారు .ఈ సంవత్సరం 06-06-2024 గురువారం రోజున వొచ్చింది, ఈ రోజు శనీశ్వరుడిని భక్తి శ్రద్ధలతో కొలిచి ఆయన అనుగ్రహం పొందితే కష్టాలు దూరమై అదృష్టం కలిసి వస్తుంది. సూర్యదేవాలయము నందు ఉదయం 7 గంటల నుండి తైలాభిషేకములు ప్రారంభం అగును.సాయం ప్రదోషకాల సమయంలో 5-30 గంటలకు శనైశ్చర హోమం జరుగును.ఈ క్రింది రాశుల వారు తప్పకుండా అర్చన, అభిషేకం,శనైశ్చర హోమం చేయించుకోవటం మంచిది. 1. ఏలినాటిశని కుంభ రాశికి కొనసాగుతోంది. ఇంకా 4 ఏళ్ళపాటు ఉంటుంది2. మీన రాశి వారికి ఏలినాటి శని జరుగుతున్నది. 3. మకర రాశి వారికి 2025 వరకు ఏలినాటి శనిఉంటుంది. 4. వృశ్చిక రాశికి అర్ధాష్టమ శని 2025 మార్చి వరకు. 5. కర్కాటక రాశివారికి అష్టమ శని 2025 మార్చివరకు పూజా రుసుములు సంపూర్ణ శనైశ్చర హోమం-3500తైలాభిషేకము-200సంకల్పం-116వివరములకు సంప్రదించగలరు. 8985806794,8919495919.దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు: 8896123777.

## ఎన్నికల విధుల్లో అందరి కృషి అభినందనీయం ...

**-సిబ్బందిని కొనియాడిన జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ ఐపియస్.**



కర్నూలు జిల్లా ప్రతినిధి జూన్ 5 విభారె న్యూస్.. పోలీంగ్, కౌంటింగ్ బందోబస్తు విధుల్లో పాల్గొన్న పోలీసు సిబ్బందికి ,కేంద్ర, రాష్ట్ర బలగాలు, ఇతర శాఖల అధికారుల కృషి, సేవలకు అభినందనలు జిల్లా ఎస్పీ.పోలీంగ్, కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా సహకరించిన అన్ని వర్గాల ప్రజలు ,రాజకీయ పార్టీలు, మీడియా కి ప్రత్యేక కృతజ్ఞతలు.జిల్లాలో 2024 సార్వత్రిక ఎన్నికల పోలీంగ్,కౌంటింగ్ లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా జిల్లా పోలీసు యంత్రాంగం,కేంద్ర,రాష్ట్ర పోలీసు బలగాలు (ఎస్ ఎస్ బి అస్సాం,ఎస్ ఎస్ బి గుజరాత్ ,గుజరాత్, సి ఆర్ పి ఎఫ్ ,బి ఎస్ ఎఫ్, (గ్రేహౌండ్స్, ఏపీఎస్పీ, కేరళ ఎస్ ఏ పి, కర్నాటక పోలీసులు, హోంగార్డ్స్,ఎస్ ఏ ఆర్ అంబర్ పేట పోలీసులు, ఎస్ పి ఎఫ్ ) అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో బాగా పని చేసి విజయవంతంగా పూర్తి చేశారని,అందుకుగాను అభినందనలు తెలియజేస్తున్నామని కర్నూలు జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ ఐపియస్ బుధవారం తెలిపారు. పోలీంగ్, కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా సహకరించినందుకు గాను అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, మిడియా కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర , పోలీసు బలగాలతో పాటు అన్ని శాఖల ఉద్యోగులు కలిసి కట్టుగా సమర్ధవంతంగా విధులు నిర్వహించడంలో అందరి కృషి ఉందన్నారు. ఎన్నికల విధుల్లో బాగా పని చేసిన కర్నూలు జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు.ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అందరూ బాగా పని చేశారని హోంగార్డు స్థాయి నుండి అడిషనల్ ఎస్పీ స్థాయి వరకు ప్రతి ఒక్కరూ నిర్విరామంగా కృషి చేశారని ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ ఐపియస్ కొనియాడారు.

## అహంకారం పెంచుకుంటే గుణపాఠం తప్పదు

### ఎన్ఎండీ ఫరూక్ నంద్యాల ఎమ్మెల్యే





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 05- అహంకారం పెంచుకుంటే గుణపాఠం తప్పదని అందుకు ఉదాహరణ 2024 ఎన్నికలే అని నంద్యాల ఎమ్మెల్యే ఎన్ ఎమ్ డి ఫరూక్ పేర్కొన్నారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పలువురు అధికారులు. రాజకీయ నాయకు లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. నంద్యాల ఎమ్మెల్యే ఫరూక్ కు కూరగాయలు వితరణ చేస్తున్న మార్కెట్ ప్రసాద్ శ్రీ కాళహస్తిశ్వర స్వామి అమ్మవార్ల శేష వస్త్రంతో మరియు మెమోంటో ఘనంగా సత్కరించారు . తాతి రెడ్డి తులసిరెడ్డి. బలిజ సంఘం అధ్యక్షులు రంగయ్య. డాక్టర్ రవి కృష్ణ. సీనియర్ జర్నలిస్టులు పసుపు లేటి జనార్దన్. చలంబాబు. మదు . మార్క ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి. మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి. ఆర్ ఓ వెంకట కృష్ణ. రెవెన్యూ అధికారులు. తదితరులు కలసి శుభాకాంక్షలు తెలిపారు . తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూ వచ్చిన ఎన్ఎండీ ఫరూక్ 20 ఏళ్ల తర్వాత మరోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈయన నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 1985, 1994, 199955 ఎమ్మెల్యేగా గెలిచారు. సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పాటు మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తి కావడం కలిసొచ్చింది. గతంలో తెదేపా హయాంలో జరిగిన అభివృద్ధితో పోలిస్తే ఐదేళ్లలో కార్యక్రమాలేమీ జరగకపోవడంతో విసిగిపోయిన అన్నివర్గాల ప్రజలు కలిసి ఫరూక్ కు పట్టంకట్టారని తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు .

## కోట్ల కేయిలకు మంత్రి పదవులు ఇవ్వాలి..

### బీసీ సంఘాల డిమాండ్

విబారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూన్ 5 కోట్ల కేఈ కుటుంబాలకు మంత్రి పదవులు ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు బుధవారం బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం నందు ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం సంయుక్త కార్యదర్శి ఏఈ నాగరాజు గౌడ్ సమావేశమునందు మాట్లాడుతూ కర్నూలు ఉమ్మడి జిల్లాలలో కోట్ల కేఈ కుటుంబాలు దశాబ్దాల నుండి రాజకీయాలను చేస్తున్నారు కోట్ల విజయభాస్కర్ రెడ్డి కేంద్ర మంత్రిగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నో పదవులు అలంకరించారు ఆయన కుమారుడు కేంద్ర మంత్రిగా ప్రస్తుతం డోన్ ఎమ్మెల్యేగా కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి గెలుపొందారు కర్నూలు నుండి మాజీ ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి కుమారుడు కేఈ శ్యాంబాబు పత్తికొండ ఎమ్మెల్యేగా గెలుపొందారు డోన్ లో కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి గెలుపుకు పత్తికొండలో కేఈ శ్యాంబాబు గెలుపుకు మాజీ మంత్రి కేఈ ప్రభాకరు కృషి చేశారు కావున తెలుగుదేశం పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రెండు కుటుంబాలకు మంత్రి పదవులను అందించాలని ఏఈ నాగరాజు సమావేశమునందు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమమునకు నంద్యాల జిల్లా బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు ఊరకొండ చిన్న మద్దయ్యనాయుడు నంద్యాల జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీ మల్లికార్జున స్వామి తదితరులు పాల్గొన్నారు



## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ ఎన్ గంగిరెడ్డి.




ఎమ్మిగనూరు జూన్ 5 విభారె న్యూస్..బుధవారం రోజు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎమ్మిగనూరు మునిసిపల్ కమీషనర్ ఎన్ గంగిరెడ్డి పట్టణం లోని ఓం శాంతి సర్కిల్, అన్నమయ్య సర్కిల్ నందు ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ఏ.ఈ. మదన్ కుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## సాధారణ తనిఖీలలో భాగంగా...



విభారె న్యూస్ డోన్ మాత్రం ప్రతినిధి:-జూన్ 5 సాధారణ తనిఖీలలో భాగంగా ఉదయము 10.30గంటల నుండి నిర్వహించిన తనిఖీలలో కర్ణాటక రాష్ట్రం తుంకూరు కు చెందిన ట్రావెల్స్ బస్ హైదరాబాదు నుండి తుముకూరు కు వెళ్తుండగా ఆపి తనికి చేయడం జరిగినది రాష్ట్రానికి కట్టవలసిన రోడ్ టాక్స్ కట్టకుండా తిరుగుతున్నట్టుగుర్తించి యాభై ఎనిమిదివేల అయిదువందలరూపాయలు జరిమానా విధించినట్లు మోటారు వాహనముల తనిఖీ అధికారి క్రాంతి కుమార్ తెలిపారు.

## ఫలించిన నాయకుల పూజలు దేశంలోని పంచభూత శివ లింగాలు?

### తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు..




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 05-ఆళ్లగడ్డ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోందిగిన భూమా అఖిలప్రియ మంగళవారం వెలువడిన ఫలితాల్లో అత్యధిక మెజారిటీతో గెలిచింది. దీంతో పార్టీ శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భూమా అఖిల ప్రియ గెలవాలని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని గత వారం రోజులుగా దేశంలోని ప్రధాన ఆలయాలను ఉమ్మడి కర్నూలు జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు గూడూరు సంజీవరాయుడు, రాయల్ కాప్స్ యువ పొలిటికల్ ప్రెసిడెంట్ అంగం శివ రాయల్ (జర్నలిస్ట్), కాశి గారి మనోజ్, గాజుల మహేష్, బత్తుల కిషోర్ కుమార్, రామిరెడ్డి, రవి, దర్శించుకుంటున్నారు.ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వారి చేసిన పూజలు ఫలించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని పంచభూత శివలింగాలను దర్శించుకొని బుధవారం తాము తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి వారిని ప్రత్యేక దర్శనం చేసుకుని, మొక్కులు చెల్లించుకోవడం జరిగిందన్నారు. తమ పూజలు, మొక్కులు ఫలించాయని, అఖండ మెజారిటీతో భూమా అఖిలప్రియ గెలిచారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాబోతున్నదని తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రఅన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని అన్నారు. భూమా అఖిల ప్రియ గెలుపుతో ఆళ్లగడ్డ ప్రాంతంలో సంబరాలు మిన్నంటాయన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రాంతం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.బి

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**